# రావి నారాయణరెడ్డి ఆదర్శప్రాయుడు

● నారాయణరెడ్డి సేవా సంస్థ అధ్యక్షుడు శ్రీనివాస్

సమావేశంలో మాట్లాడుతున్న రావి నారాయణరెడ్డి సేవా సంస్థ అధ్యక్షుడు శ్రీనివాస్

భువనగిరి కలెక్టరేట్, మార్చి 17 : స్వతంత్ర్య భారత దేశ పార్లమెంటును 1952లో ప్రారంభించిన రావి నారాయణరెడ్డి నేటి తరానికి ఆదర్శప్రాయుడని రావి నారాయణరెడ్డి సేవా సంస్థ అధ్యక్షుడు చెరుకుపల్లి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని బొల్లేపల్లిలో రావి నారాయణరెడ్డి సేవా సంస్థ ఆధ్వర్యంలో సాయుధ పోరాట యోధుడు రావి నారాయణరెడ్డి నిలువెత్తు కాంస్య విగ్రహ ఏర్పాటుకు ఆదివారం సంస్థ సభ్యుల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూస్వామ్య కుటుంబంలో పుట్టి విలాసవంతమైన జీవితాన్ని తృణప్రాయంగా వదిలి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని, మొట్టమొదటి సార్వత్రిక ఎన్నికల్లో దేశంలోనే అత్యధిక మెజారిటీ సాధించిన గొప్ప వ్యక్తి నారాయణరెడ్డి అన్నారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా ప్రాణాలను పణంగా పెట్టి సాయుధ పోరాటం చేసి, తనకు వారసత్వంగా వచ్చిన 500 ఎకరాల భూమిని నిరుపేదలకు దానం చేసిన మహా మనిషి అని కొనియాడారు. వెట్టి చాకిరీ నిర్మూలన కోసం పోరాడి, హరిజన సేవా సంఘ్ సెక్రటరీగా వంద పాఠశాలలను ప్రారంభించిన మహా వ్యక్తి అన్నారు. అటువంటి మహనీయుని జ్ఞాపకార్థం రాష్ట్రంలో ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేసిన చిహ్నాలు, విగ్రహాలు, ప్రాంతాలు, ప్రభుత్వ నిర్మాణాలకు పేర్లు లేక పోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. భావి తరాలకు స్ఫూర్తిదాయకంగా ఉండేందుకు ఆయన నిలువెత్తు కాంస్య విగ్రహాన్ని బొల్లేపల్లి గ్రామంలో ఏర్పాటు చేసేందుకు కార్యవర్గ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలిపారు.

సమావేశంలో సంస్థ ఉపాధ్యక్షుడు పడాల భాస్కర్, సెక్రటరీ రావి సుకేశ్‌రెడ్డి, కోశాధికారి తిరుమనిదాసు వెంకటేశ్వర్లు, ముఖ్య సలహాదారు భువనగిరి సత్యనారాయణ, సలహాదారు రావి ప్రభాకర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

# తనువు చాలిస్తూ.. ఐదుగురికి జీవం

● యువకుడి అవయవాలు దానం చేసిన కుటుంబ సభ్యులు

యాదగిరి (ఫైల్)

రాజాపేట, మార్చి 17 : మండలంలోని నర్సాపురం గ్రామానికి చెందిన యమ్మ యాదగిరి (20) హైదరాబాద్‌లో ప్రవేటు ఉద్యోగం చేస్తూ ఈసీఐఎల్ ఏఎస్‌రావు నగర్‌లో ఉంటున్నాడు. ఈ నెల 11న తెల్లవారుజామున ఇంటి నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న క్రమంలో యాదగిరిగుట్ట వద్ద రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో యాదగిరి తలకు తీవ్ర గాయాలై అపస్కారక స్థితికి వెళ్లాడు. హైదరాబాద్ యశోద దవాఖానకు తీసుకెళ్లగా పరీక్షలు నిర్వహించిన వైద్యులు మెదడులో రక్తస్రావంతో బ్రెయిన్ డెడ్ అయినట్టు నిర్ధారించారు. యాదగిరి తండ్రి కొమురయ్య, కుటుంబ సభ్యులకు యశోద వైద్య బృందం అవయదానంపై అవగాహన కల్పించింది. దాంతో జీవన్‌దాన్ పథకం కింద యాదగిరి అవయవాలు ఇతరులకు దానం చేసేందుకు అంగీకరించారు. ఉస్మానియా జనరల్ ఆస్పత్రి వైద్య బృందం సాయంతో ఆదివారం అవయవ దానం చేపట్టారు. బ్రెయిన్ డెడ్ అయిన యాదగిరి లివర్, గుండె, కండ్లు, ఊపిరితిత్తులు, కిడ్నీలను ఉస్మానియా దవాఖానలో ప్రాణపాయ స్థితిలో ఉన్న ఐదుగురికి దానం చేసి జీవం పోశారు. చేతికి అందివచ్చిన కొడుకు చనిపోయి ఇతరులకు జీవం పోశాడన్న సంతృప్తి మిగిలిందని యాదగిరి కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతూ తెలిపారు.

# ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

లక్ష్మీదేవిగూడెంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సరోజ

బీబీనగర్, మార్చి 17 : మండలంలోని రాఘవాపురం గ్రామంలో గల సాంఘిక సంక్షేమ సైనిక శిక్షణ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రాఘవాపురం, లక్ష్మీదేవిగూడెం గ్రామాల్లో ఆదివారం మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సరోజ ఆధ్వర్యంలో గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం గ్రామస్తులతో కలిసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామక పాండురంగశర్మ, కో ఆర్డినేటర్ డాక్టర్ విజయలక్ష్మి, స్రవంతి, ప్రతిభ, సంతోష, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

# నిర్మాణ కార్మికులు నైపుణ్యం పెంపొందించుకోవాలి

భవన నిర్మాణ నైపుణ్య శిక్షణలో పాల్గొన్న కార్మికులు

ఆత్మకూరు(ఎం), మార్చి 17 : భవన నిర్మాణ కార్మికులు నూతన విధానాలతో నైపుణ్యంతో పనిచేస్తేనే భవిష్యత్తు ఉంటుందని సీఐడీసీ ట్రైనింగ్ కో ఆర్డినేటర్ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పల్లెర్ల గ్రామంలో కార్మికుల సంక్షేమ మండలి కన్‌స్ట్రక్షన్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంచుకున్న రంగాల్లో నైపుణ్య శిక్షణను కార్మికులందరూ వినియోగించుకోవాలన్నారు.

కార్యక్రమంలో ఇన్‌స్ట్రక్టర్ మెట్టు మధు, డీఈఎంఓ హరికృష్ణ, జడ్పీటీసీ నరేందర్ గుప్తా, పీఏసీఎస్ డైరెక్టర్ నర్సింహ పాల్గొన్నారు.

# కుష్ఠు వ్యాధి నిర్ధారణకు ఇంటింటి సర్వే

ఇంటింటి సర్వే చేస్తున్న ఆశ కార్యకర్తలు

ఆత్మకూరు(ఎం), మార్చి 17 : కుష్ఠు వ్యాధి నిర్ధారణ కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు మండల కేంద్రంలో ఆదివారం ఇంటింటి సర్వే చేపట్టారు. శరీరంపై మచ్చలు, నరాల స్పర్శ లేకపోవడం కుష్ఠు వ్యాధి లక్షణాలు అని, ఇందుకోసం ముందుగానే వ్యాధి నిర్ధారణకు ఇంటింటి సర్వే చేపట్టినట్లు మండల వైద్యాధికారి విలియం కేరీ అన్నారు. సర్వేలో భాగంగా పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.

# యాదగిరిగుట్టలో భక్తుల సందడి



ఆలయంలో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట, మార్చి 17 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి క్షేత్రంలో భక్తుల సందడి నెలకొన్నది. ఆదివారం సెలవు కావడంతో స్వయంభూ నారసింహుడిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మాఢ వీధులు, క్యూ కాంప్లెక్స్, క్యూలైన్లు, తిరు మాఢవీధులు, గర్భాలయ ముఖ మండపంలోని క్యూలైన్లు సందడిగా మారాయి. తెల్లవారుజాము నుంచే స్వయంభూ నారసింహుడిని దర్శించుకున్న భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి నిత్యోత్సవాలు తెల్లవారుజాము నుంచే మొదలయ్యాయి. ఉదయం సుప్రభాత సేవతో స్వయంభూ నారసింహుడిని మేల్కొలిపిన అర్చకులు తిరువారాధన నిర్వహించి, ఆరగింపు చేపట్టారు. స్వామివారికి నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన జరిపారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు నిర్వహించిన దర్బార్ సేవలో భక్తులు పాల్గొని తరించారు. పాతగుట్ట ఆలయంలో ఆర్జిత పూజలను అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారి ధర్మ దర్శనానికి 2 గంటలు, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. స్వామివారిని సుమారు 35వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.42,59,584 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

# స్వర్ణమయం కానున్న స్వామివారి వాహన సేవలు

యాదగిరిగుట్టకు చేరిన పంచ లోహంతో సిద్ధమైన స్వామివారి వాహన సేవలు

యాదగిరిగుట్ట, మార్చి 17 : యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి ఊరేగింపునకు వినియోగించే వాహన సేవలు ఇక స్వర్ణమయం కానున్నాయి. హైదరాబాద్‌కు చెందిన ఓ దాత తన సొంత ఖర్చుతో స్వామివారి గజ వాహనం, పొన్న, గరుడ, అశ్వ, సింహ, శేష, హంస వాహనాలను బంగారు తాపడం చేసేందుకు సంకల్పించారు. తమిళనాడు మహాబలిపురంలో రవీంద్రన్ స్థపతి ఆధ్వర్యంలో వాహన సేవలను ఇత్తడి, పంచ లోహాలతో సిద్ధం చేశారు. ఇందులో ఆదివారం గజ, శేష, గరుడ వాహనాలు యాదగిరిగుట్టకు చేరుకోగా ఆలయ ప్రధానార్చకులు పరిశీలించారు. వాహనాలు సరైన రీతిలో ఉన్నాయా.. ఏమైనా లోటుపాట్లు ఉన్నాయా? అని క్షుణ్ణంగా పరిశీలించి తుది నిర్ణయం తీసుకోనున్నారు. అనంతరం మిగతా వాహన సేవలు సిద్ధం చేసి బంగారు తాపడంతో తీర్చిదిద్దనున్నారు. వాహనాలు సిద్ధమైన తర్వాత ఇందుకు వినియోగించే బంగారం, ఖర్చు, దాతల పేర్లు అధికారికంగా వెల్లడిస్తామని ఆలయ అధికారులు తెలిపారు.

# బీసీలకు 10 ఎంపీ సీట్లు కేటాయించాలి

● బీసీ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

కృష్ణయ్యను సన్మానిస్తున్న బీసీ సంఘం నాయకులు

రామన్నపేట, మార్చి 17 : బీసీలకు అన్ని పార్టీలు 10 ఎంపీ సీట్లు కేటాయించాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. మండలంలోని ఇంద్రపాలనగరంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలు రాజకీయ, ఆర్థిక, విద్యారంగాల్లో అభివృద్ధి కావాలన్నారు. ఓట్లు మనవి, సీట్లు మనవి అనే నినాదంతో ముందుకు సాగాలని సూచించారు. బీసీలను విస్మరిస్తున్న పార్టీలకు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ రాజ్‌కుమార్, విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పల్లగొర్ల మోదీరాందేవ్, నాయకులు కసరబోయిన మత్స్యగిరి, నరేశ్ గౌడ్, మహాలింగం యాదవ్, నర్సింహ, సంజీవ పాల్గొన్నారు.

# పశువుల సంతలో మెరుగైన వసతులు కల్పిస్తాం

● మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్

మోత్కూరు పశువుల సంతకు వచ్చిన మేకలను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్

మోత్కూరు, మార్చి 17 : మోత్కూరు పశువుల సంత పునఃప్రారంభమైనందున మెరుగైన వసతులు కల్పిస్తామని మున్సిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్ అన్నారు. పశువుల సంతను ఆదివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఎన్నో ఏండ్ల నుంచి నెలకొల్పబడిన పశువుల సంతను ప్రజలు, రైతులు ఆదరించాలన్నారు. మోత్కూరు, గుండాల, ఆత్మకూరు(ఎం), అమ్మనబోలు, వలిగండ, తిరుమలగిరి, దేవరుప్పల ప్రాంతాల్లోనూ మున్సిపల్ సిబ్బందితో కరపత్రాల పంపిణీ, మైక్‌ల ద్వారా ప్రచారం చేయిస్తున్నట్లు తెలిపారు. పశువుల సంత, తైబజార్ వల్ల పేద వర్గాలకు మరింత మార్కెట్ వసతి సమకూరుతుందన్నారు. కార్యక్రమంలో రైతులు శ్రీనివాస్ రెడ్డి, లింగయ్య, మారయ్య, లింగయ్య పాల్గొన్నారు.

# శివాజీ విగ్రహం కోసం రూ.10వేల విరాళం

ఆత్మకూరు(ఎం), మార్చి 17 : శివాజీ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న శివాజీ విగ్రహం కోసం బీఆర్ఎస్ నాయకుడు ఎండీ హైమద్ ఆదివారం రూ.10వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో శివాజీ యూత్ క్లబ్ అధ్యక్షుడు కోరె మల్లేశ్, శ్రీనివాసచారి, క్రాంతికుమార్, రాజు, వినయ్ పాల్గొన్నారు.

# పదో తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

బీబీనగర్, మార్చి 17 : మండలంలోని పడమటిసోమారం గ్రామంలో పదో తరగతి విద్యార్థులకు తంతరపల్లి రాందాస్‌గౌడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ ప్రదీప్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని పరీక్షలు మంచిగా రాయాలన్నారు.

ఉత్తమ మార్కులు సాధించిన ప్రథమ విద్యార్థికి రూ.5వేలు, మిగతా వారికి రూ.2500 బహుమతిగా అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు అల్వ భాస్కర్‌రెడ్డి, నాయకులు బస్వయ్య, రామకృష్ణారెడ్డి, రాంకొండల్ పాల్గొన్నారు.

# ప్రజావాణి రద్దు : కలెక్టర్

భువనగిరి కలెక్టరేట్, మార్చి 17 : పార్లమెంటు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చినందున నేటి ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి హనుమంతు కె.జెండగే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్‌ను దృష్టిలో ఉంచుకొని ఈ నెల 18న నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేయడం జరిగిందని పేర్కొన్నారు. అలాగే ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముగిసే వరకు జూన్ 6వరకు ప్రజావాణి కార్యక్రమం ఉండదని తెలిపారు. ప్రజలు గ్రహించాలని సూచించారు.

# ఎంపీపీ ఉమాదేవిపై ఏప్రిల్ 1న అవిశ్వాసం

● గతంలో తెచ్చుకున్న స్టేను కోట్టివేసిన హైకోర్టు

సంస్థాన్ నారాయణపురం, మార్చి 17 : ఎంపీపీ గుత్తా ఉమాదేవిపై ఏప్రిల్ 1న అవిశ్వాసం పెట్టడానికి చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి అదేశాల మేరకు ఎంపీటీసీలకు నోటీసులు జారీ చేశామని ఎంపీడీఓ ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఎంపీపీ గుత్తా ఉమాదేవిపై 9మంది బీఆర్ఎస్ ఎంపీటీసీలు గతంలో అవిశ్వాసం తీర్మానం పెట్టగా ఎంపీపీ హైకోర్టు నుంచి స్టే తెచ్చుకోవడంతో ఆగిపోయింది. ప్రస్తుతం హైకోర్టు స్టేను కొట్టివేయడంతో ఏప్రిల్ 1న అవిశ్వాసం ప్రవేశపెడుతున్నామని అధికారులు ఎంపీటీసీలకు నోటీసులు పంపించారు. కాగా, మండలంలో 10మంది బీఆర్ఎస్ నుంచి, సీపీఎం నుంచి ఇద్దరు, సీపీఐ నుంచి ఒక్కరు ఎంపీటీసీలుగా గెలుపొందారు. బీఆర్ఎస్ నుంచి గెలిచి ఎంపీపీ అయిన ఉమాదేవి ఉప ఎన్నిక తరువాత కాంగ్రెస్ పార్టీలో చేరడంతో బీఆర్ఎస్ ఎంపీటీసీలు 9మంది ఎంపీపీపై ఆవిశ్వాసం పెట్టారు.

# పాన్‌షాపులో చోరీ

రామన్నపేట, మార్చి 17 : మండల కేంద్రంలోని పాన్‌షాపులో శనివారం రాత్రి చోరీ జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. తాటిపాముల సాయి, శ్రవణ్‌కుమార్ చిట్యాల – భువనగిరి రోడ్డులో పాన్ షాపు నిర్వహిస్తున్నారు. శనివారం రాత్రి 11గంటలకు సాయి పాన్‌షాపును మూసి ఇంటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం షాపు తీయడానికి వెళ్లగా తాళాలు పగులగొట్టి ఉన్నాయి. షాపు తెరిచి చూడగా సిగరెట్లు, పాన్ తయారీకి ఉపయోగించే సామాను దొంగిలించినట్లు గుర్తించాడు. వాటి విలువ రూ.10వేల నుంచి 15వేల వరకు ఉంటుందని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

# 'యాదమ్మ మృతి కారకులను కఠినంగా శిక్షించాలి'

వలిగొండ, మార్చి 17 : మండలంలోని ఎం.తుర్కపల్లి గ్రామానికి చెందిన బద్దం యాదమ్మ మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని వయోవృద్ధుల సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ కొండూరి వెంకటేశం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ వృద్ధురాలు అని చూడకుండా యాదమ్మపై భూమి పట్టా కోసం కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారన్నారు. ఆమె మృతికి కారణమైన కొడుకు సాయిరెడ్డి, కోడలు స్వరూప, మనుమడు రాంరెడ్డిపై 307 సెక్షన్ కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని జిల్లా కలెక్టర్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా న్యాయమూర్తికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. వృద్ధులపై ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు.



ఎమ్మెల్యే మందుల సామేల్‌ను శాలువా కప్పి సన్మానిస్తున్న స్నేహితులు

# ఎమ్మెల్యే సామేల్‌కు క్లాస్‌మేట్స్ అభినందనలు

మోత్కూరు, మార్చి 17 : ఎమ్మెల్యే మందుల సామేల్‌కు మోత్కూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల అప్పటి పదో తరగతి బ్యాచ్‌కు చెందిన స్నేహితులు (క్లాస్‌మేట్స్) హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆదివారం శాలువా కప్పి సన్మానించారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పేద వర్గానికి చెందిన సామేల్ అంచెలంచెలుగా ఎదిగారన్నారు. తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పని చేసిన ఆయన తీరును అభినందించారు. ఎమ్మెల్యే సామేల్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం ప్రధాన కార్యదర్శి జి.సోమనర్సయ్య, స్నేహితులు టి.వేణుగోపాల్‌రెడ్డి, బచ్చు గణేశ్, జితేందర్‌రెడ్డి, బి.రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వరుడి మహా సంప్రోక్షణ ప్రతిష్ఠ

వేంకటేశ్వరుడి ఆలయంలో పూర్ణ ప్రతిష్ఠ పూజా కార్యక్రమానికి వెళ్తున్న టీటీడీ ఆలయ ప్రధానార్చకుడు వేణుగోపాల దీక్షితులు

రాజాపేట, మార్చి 17 : మండలంలోని రేణికుంట గ్రామ శివారులో సంకల్ప సిద్ధి వేంకటేశ్వరాలయంలో తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి దేవాలయ ప్రధానార్చకుడు అర్చకం వేణుగోపాల దీక్షితులు, శ్రీమాన్ ముత్తు బట్టర్‌స్వామి ఆధ్వర్యంలో ఆదివారం విగ్రహ మహా సంప్రోక్షణ పూర్ణ ప్రతిష్ఠ పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ శిఖరం, శ్రీదేవి, భూదేవి పరివార ఆలయ జీవధ్వజ ప్రతిష్ఠా మహోత్సవ పూజలు చేశారు. అనంతరం ఆలపించిన వేంకటేశ్వరుడి భక్తి గీతాలు, నిర్వహించిన సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పీఠాధిపతులు శ్రీమాన్ బిక్కవోలు కేశవాచార్య దైవజ్ఞశర్మ, శ్రీమాన్ బీవీఆర్‌బీజీఆర్‌కే గౌతమ్‌కృష్ణ, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు కూర కల్యాణి బద్రీనాథ్, కుంబాల శోభారాణీఎల్లారెడ్డి, సూదిరెడ్డి కళావతీనాగిరెడ్డి, శ్రీవట్టం మంజులారాఘవేంద్ర, సమ్మెట రాజేశ్వరీశ్రీనివాస్ రావు, నరేశ్, భక్తులు పాల్గొన్నారు.

# వేంకటేశ్వరస్వామికి 108 కలశాలతో క్షీరాభిషేకం

కలశాలతో పవిత్ర జలాలను తీసుకొస్తున్న జడ్పీటీసీ కోట పుష్పలత, ఆలయ చైర్మన్ కోట మల్లారెడ్డి

భూదాన్ పోచంపల్లి, మార్చి 17 : మండలంలోని కనుముక్కుల గ్రామంలో పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం దేవాలయంలో 108 కలశాలతో క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. ఆలయంలో నిత్య హోమం, సుదర్శన హవనం, తిరువీధి ఉత్సవం, బలిహరణం, తీర్థ ప్రసాద గోష్ఠి కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో జడ్పీటీసీ కోట పుష్పలత, ఆలయ చైర్మన్ కోట మల్లారెడ్డి, నాయకులు బోగ చంద్రశేఖర్, కోట అభిలాశ్‌రెడ్డి, శ్రీజ, కోట భూపాల్‌రెడ్డి, కోట సత్తిరెడ్డి, కోట అంజిరెడ్డి, రంగ మధు, గట్టు పాండురంగారెడ్డి, పాక నరసింహ, భక్తులు పాల్గొన్నారు.

# భక్తాంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం



ఆంజనేయస్వామి పూజల్లో పాల్గొన్న గ్రామస్తులు

మోత్కూరు, మార్చి 17 : మున్సిపాలిటీ పరిధిలోని కొండాపురంలో భక్తాంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పారునంది లక్ష్మణమూర్తిశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ జి.లక్ష్మీనర్సింహారెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు రమేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గ్రీన్ స్టార్ వెంచర్ బాధితుల ధర్నా

తూప్రాన్‌పేట గ్రామంలోని గ్రీన్‌స్టార్ వెంచర్‌లో ధర్నా చేస్తున్న బాధితులు

చౌటుప్పల్ రూరల్, మార్చి 17 : మండలంలోని తూప్రాన్‌పేట గ్రామ పరిధిలోని గ్రీన్ స్టార్ వెంచర్‌లో తమ ప్లాట్లు కబ్జా చేశారని బాధితులు ఆదివారం వెంచర్ వద్ద ధర్నా చేశారు. అంబికా దర్బార్‌బత్తి యాజమాని ప్రసాద్ 110 ప్లాట్లను అక్రమంగా కబ్జా చేశాడని తెలిపారు. సమస్యను పరిష్కరించాలని పలుమార్లు ప్రజావాణిలో, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా తగిన న్యాయం జరుగలేదన్నారు. మా ప్లాట్లను కబ్జా చేసిన ప్రసాద్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, తమ ప్లాట్లు తిరిగి ఇప్పించాలని కోరారు.

# అడ్డగూడూరులో దొంగల బీభత్సం

అడ్డగూడూరులో బీరువాను పగులగొట్టిన దొంగలు

అడ్డగూడూరు, మార్చి 17 : మండల కేంద్రంలో దొంగలు బీభత్సం సృష్టించారు. శనివారం రాత్రి నలుగురి ఇండ్లల్లో చోరీకి పాల్పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన తుప్పతి అంజమ్మ, తుప్పతి మల్లయ్య, తుప్పతి రవి, దాసరి యాదగిరి తమ ఇండ్లకు తాళాలు వేసి కొందరు ఊరికి వెళ్లగా, మరికొందరు వేరేవాళ్ల ఇంట్లో నిద్రించడానికి వెళ్లారు. ఉదయం వచ్చేసరికి తాళాలు పగులకొట్టి తలుపులు తీసి వస్తువులు చిందరవందరంగా పడి ఉండటంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. తుప్పతి అంజమ్మ ఇంట్లో 2 తులాల బంగారం, 45 తులాల వెండి, రూ.6వేల నగదు, తుప్పతి మల్లయ్య ఇంట్లో రూ.70వేల నగదు, దాసరి యాదగిరి ఇంట్లో 8తులాల వెండి, రూ.8వేల నగదు చోరీ అయ్యిందని బాధితులు తెలిపారు. బాధితుల సమాచారంతో రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ నాగరాజు ఆధ్వర్యంలో క్లూస్ టీం, క్రైమ్ పోలీసులు వచ్చి పరిశీలించారు.